కళ తప్పిన జంక్షన్లు



తుప్పపట్టి, రంగుమారి, పెయింటింగ్ ఊడిపోతున్న పూలమొక్క నమూనా



నిర్వహణ కరువై పాడైపోతున్న, రైల్వే న్యూకాలనీ జంక్షన్‌లోని రైలింజన్

- వైఎస్సార్‌సీపీ హయాంలో కూడళ్ల సుందరీకరణ
- నమూనా రైలింజన్.. వాటర్ ఫౌంటెయిన్ వద్ద సెల్ఫీల కోసం యువత ఆసక్తి
- నేడు నిర్వహణ లోపంతో శిథిల దశలో నిర్మాణాలు



అక్కయ్యపాలెం మహారాణి పార్లర్ వద్ద నిర్వహణ కరువైన ఫౌంటెయిన్

పనిచేయని ఫౌంటెయిన్..

మరో ప్రధాన జంక్షన్ అక్కయ్యపాలెంలోని మహారాణి పార్లర్ వద్ద కూడా అందంగా అభివృద్ధి చేసి, మంచి లైటింగ్, వాటర్ ఫౌంటెయిన్ వంటివి ఏర్పాటు చేశారు. కానీ నేడు ఇక్కడ కూడా అన్నీ పాడై, ఫౌంటెయిన్ సరిగ్గా పని చేయని పరిస్థితి నెలకొంది. జీవీఎంసీ అధికారులు కొద్దిపాటి శ్రద్ధ వహించి, సరైన నిర్వహణ చేపటితే ప్రజాధనం వృథా కాకుండా, మంచిగా మన ప్రాంతాలను కాపాడుకోవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉన్న జంక్షన్లు కళ తప్పాయి. నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నగరంలోని పలు జంక్షన్లను సుందరీకరించారు. అందమైన వాటర్ ఫౌంటెయిన్లు, కళాఖండాలు ఏర్పాటు చేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. చూసిన వారు ముచ్చటపడేలా, ఆగి ఒక ఫొటో తీసుకునేలా ఈ జంక్షన్లు కనిపించేవి. కానీ నేడు ఇవి నిర్వహణ కోల్పోయి, కళావిహీనంగా మారాయి. ముఖ్యంగా రైల్వే న్యూకాలనీ జంక్షన్‌లో ప్రత్యేకంగా రైల్ ఇంజన్ నమూనా, దాని చుట్టూ అందమైన లైటింగ్, మరింత ఆకర్షణీయంగా వాటర్ ఫౌంటెయిన్ ఏర్పాటు చేశారు. ఆ రోజుల్లో ఇటు వైపు వెళ్లే ప్రతి ఒక్కరూ ఆగి, సెల్ఫీలు, ఫొటోలు తీసుకునేందుకు ముచ్చట పడేవారు. కానీ ఇప్పుడు ఈ జంక్షన్ కళ తప్పింది. సరైన లైటింగ్ లేదు.. ఫౌంటైన్ పని చేయడంలేదు.. దుమ్ము, ధూళితో నిండి రైలింజన్ శిథిలమవుతోంది. దీంతో నాటి అందాలు నేడు నిర్వీర్యమవుతున్నాయి. మరో పక్క చక్కటి పూలమొక్క నమూనాను తయారు చేశారు. ఇది కూడా పూర్తిగా దుమ్ము, ధూళి పట్టి, రంగు మారిపోయి, పెయింటింగ్ ఊడిపోతోంది.

నిర్లక్ష్యం తగదు..

ఎంతో ఖర్చుపెట్టి గత ప్రభుత్వం అభివృద్ధి చేసిన రైల్వే న్యూకాలనీ జంక్షన్‌ను నిర్లక్ష్యంగా వదిలేయడం సరికాదు. మొదట్లో ఉన్న శ్రద్ధ నేడు జీవీఎంసీ సిబ్బందికి లేకుండా పోయింది. నగరం అభివృద్ధి చెందింది అంటే అది ప్రజాధనంతోనే. అటువంటి ప్రజాధనాన్ని ఇలా నిర్లక్ష్యంగా వదిలేయడం మంచిది కాదు. వీటిని జాగ్రత్తగా కాపాడుకోవాలి.

– ఎం. తిరుమలరావు, రైల్వేన్యూకాలనీ

జంక్షన్‌లో ఫొటోలు దిగేవారు..

రైల్వేన్యూకాలనీ జంక్షన్‌ను అభివృద్ధి చేసిన తొలి రోజుల్లో చాలా మంది ఇక్కడ ఆగి ఫొటోలు తీసుకుని వెళ్లేవారు. అంత అందంగా మా జంక్షన్‌ను అభివృద్ధి చేశారు. చక్కని రైలింజన్, పచ్చదనం, లైటింగ్, వాటర్ ఫౌంటెయిన్ ఏర్పాటు చేశారు. కానీ నేడు ఇవేవీ ఇక్కడ కానరావడం లేదు. వీటిని తిరిగి ఏర్పాటు చేయాలి.

– కనకమహాలక్ష్మి, రైల్వేన్యూకాలనీ

కొండవాలులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కప్పరాడలో శిథిలమైన మెట్ల మార్గాన్ని పరిశీలిస్తున్న జెడ్సీ రాము

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కప్పరాడ కొండవాలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు గురువారం జోనల్ కమిషనర్ రాము శంకుస్థాపన చేశారు. సుమారు రూ.27 లక్షలతో సీసీ, మెట్ల మార్గాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం వార్డులోని పలు వీధుల్లో జోనల్ అధికారులతో కలిసి జెడ్సీ పర్యటించారు. పలు సమస్యలను పరిష్కరించాలని ఆయనకు ప్రజలు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకురాలు పి.శ్యామలాదీపిక, కార్పొరేటర్ కామేశ్వరి, ఏఈ అర్చన, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రభుదాస్, వార్డు కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంగన్‌వాడీ కేంద్రాలు ఒక పూటే



నక్కవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రం శుక్రవారం నుంచి ఉదయం 8 గంటల నుంచి 12 వరకే పని చేస్తుంది. ఎండలు ఎక్కువగా ఉండటంతో పిల్లలు ఇబ్బందులకు గురి కాకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ కేంద్రంలో బాలింతలు –33 మంది, ప్రీ స్కూల్ పిల్లలు–20 మంది, గర్భిణులు–28 మంది, 3 నుంచి 7 సంవత్సరాల పిల్లలు 163 మంది ఉన్నారు.

క్లుప్తంగా

ఫస్ట్ ఎయిడ్ కిట్ అందజేత



హెచ్‌ఎంకు కిట్ అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

సీతంపేట: డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హస్కూల్‌కు ఫస్ట్ ఎయిడ్ కిట్ అందజేసింది. ప్రతి ఏటా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాష్ ప్రోగ్రాంలో భాగంగా నగరంలో ఉన్న వంద స్కూళ్లకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందజేస్తున్నారు. దీనిలో భాగంగా ఫౌండేషన్ హెల్త్ ఎడ్యుకేటర్ జి.రేణుక, ఎఫ్ఎల్ఎన్ టీచర్ డి.ధరణి చేతుల మీదుగా స్కూల్ హెచ్‌ఎం లక్ష్మీ నరసకు అందజేశారు. విద్యార్థులకు గాయాలు అయినప్పుడు, అత్యవసర సమయంలో ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉపయోగపడుతుందని హెచ్‌ఎం తెలిపారు. ఈ కార్యక్రమంలోపాఠశాల ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, డి.నిర్మల, సునంద్, పి.లలిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌టీలకు ముగిసిన శిక్షణ



మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాదరావు

సీతంపేట: జిల్లా మలేరియా అధికారి ఎం.తులసి ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నీషియన్లకు జరుగుతున్న రెండు రోజుల రీ ఓరియెంటేషన్ శిక్షణ గురువారం ముగిసింది. రెండవ రోజు శిక్షణ కార్యక్రమంలో మలేరియా అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాదరావు, డీఎంవో తులసి, ఏఎంవో సీహెచ్ సత్యనారాయణ, విశ్రాంత ఎంపీహెచ్ ఈవో కె.పాపారావు శిక్షణ ఇచ్చారు. మలేరియా నిర్మూలన కార్యక్రమ ప్రణాళిక, లక్ష్యాలు, మలేరియా స్లైడ్ టెక్నిక్, పారసైట్ నిర్ధారణలో మెలకువలు, మైక్రోస్కోపిక్ టెక్నిక్స్ వివరించారు. ఈ కార్యక్రమంలో పలు ఆరోగ్య కేంద్రాల ల్యాబ్ టెక్నీషియన్లు, సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

22, 23 తేదీల్లో హస్తకళా ప్రదర్శన

సీతమ్మధార: ద్వారకానగర్ పవన్ షోరూం వెనుక రోడ్డులోని బా బాపు భవన్‌లో బా బాపూ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో హస్తకళా ప్రదర్శన నిర్వహించనున్నట్లు సంఘ ప్రెసిడెంట్ అంతర్వేది ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఔత్సాహిక మహిళలు వారి ఉత్పత్తులు ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. బ్లాక్ ప్రింటింగ్ వస్త్రాలు, పిండి వంటలు, మగ్గం వర్క్ వస్త్రాలు, చాక్‌లెట్స్, పచ్చళ్లు, రెడీమేడ్ దుస్తులు, చీరలు, మొక్కలు, గోమయంతో చేసిన ఉత్పత్తులు లభిస్తాయని పేర్కొన్నారు. సేవా సంఘం సెక్రటరీ వై.రమణి ఈ ప్రదర్శన మహిళలను ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయడానికి ప్రోత్సహిస్తున్నారన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

సీతమ్మధార: ద్విచక్ర వాహనం ఢీకొని ఓ మహిళ తీవ్ర గాయాలపాలైన ఘటన ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. సీతంపేట గణేష్‌నగర్‌కు చెందిన వంగా విజయలక్ష్మి అనే మహిళ గురువారం ఉదయం అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి సీతంపేట వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతుండగా.. అటుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమె తలకు తీవ్ర గాయమైంది. వెంటనే అక్కడ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు 108 ద్వారా కేజీహెచ్‌కు ఆమెను తరలించారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలలు, వృద్ధుల సంరక్షణ అందరి బాధ్యత

విశాఖ లీగల్: ప్రభుత్వ పథకాలపై అందరికీ అవగాహన అవసరమని విశాఖ జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ తెలిపారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యాలయంలో గురువారం జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాలలను సంరక్షించే బాధ్యత సమాజంలో అందరిపైనా ఉందన్నారు. లైంగిక దాడులకు గురవుతున్న బాలల రక్షణ బాధ్యతలను అందరూ స్వీకరించాలన్నారు. వయోవృద్ధులు సైతం కుటుంబాల నుంచి వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాలలు, వృద్ధుల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలన్నారు. విశాఖపట్నం ఐసీడీఎస్ అధికారి జయ దేవి, అనకాపల్లి సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రామారావు, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఐసీడీఎస్ అధికారులు, వయోవృద్ధులు, బాలల సంక్షేమ శాఖ అధికారులు, సేవా సంస్థల ప్రతినిధులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

సునీతా విలియమ్స్‌కు మహిళల అభినందనలు



జాతీయ జెండాతో సునీతా విలియమ్స్‌కు అభినందనలు తెలుపుతున్న మహిళా వాకర్లు

మురళీనగర్: సుదీర్ఘకాలం తర్వాత అంతరిక్షం నుంచి భూమికి చేరుకున్న భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్‌కు మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు జాతీయ జెండాతో స్వాగతం పలుకుతూ అభినందనలు తెలిపారు. క్లబ్ అధ్యక్షురాలు కె.మాధవి అధ్యక్షతన గురువారం కార్యవర్గ సమావేశం ప్రత్యేకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత సంతతి మహిళ 9 నెలల పాటు అంతరిక్షంలో గడిపి తన ధైర్యసాహసాలను ప్రకటించారన్నారు. సునీతా విలియమ్స్ లాంటి మహిళలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం ఈ నెలలో నిర్వహించిన సామాజిక సేవా కార్యక్రమాలపై చర్చించారు. కోశాధికారి శేషామని జమా ఖర్చులను వివరించారు. మార్చి 22న ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా వేసవిలో ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంతలు తవ్వించేలా మహిళలను చైతన్యపరచి, భూగర్భ జలాల పునరుద్ధరణకు కృషి చేయాలని మాధవి పిలుపునిచ్చారు. పూర్వ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి మాట్లాడుతూ వేసవిలో పక్షుల కోసం బాల్కనీలోని డాబాలపై చిన్న మట్టి తొట్టెల్లో నీటిని ఉంచాలన్నారు. మార్చి 31న ఐఐఏఎం సెమినార్ హాల్‌లో నిర్వహించనున్న జిల్లా 101 రెండో క్యాబినెట్ మీటింగ్‌కు క్యాబినెట్ సభ్యులు హాజరు కావాలని ఎడిటర్ శిరీష కోరారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పి.కమల, కోశాధికారి శేషామణి, ఉపాధ్యక్షురాలు సిహెచ్.వరలక్ష్మి , జాలీ వాకర్ సుగుణ కృష్ణవేణి, లీలా నాయుడు పాల్గొన్నారు.

స్వీయ క్రమశిక్షణ అవసరం



సదస్సులో పాల్గొన్న సీఐఐ ఐడబ్ల్యూఎన్ ఏపీ చైర్‌పర్సన్ రమాదేవి తదితరులు

సీతంపేట: సీఐఐ ఐడబ్ల్యూఎన్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో స్థానిక లంకపల్లి బుల్లయ్య కళాశాలకు చెందిన మహిళా సాధికారత సెల్ ఆధ్వర్యంలో గురువారం కాలేజీలో 'మేనేజింగ్ సెల్ఫ్, స్లీప్ ఫర్ అకడమిక్ సక్సెస్ ప్రాక్టికల్ టిప్స్ ఫర్ ఇంజినీరింగ్ స్టూడెంట్స్' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అమరా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, సీఐఐ ఐడబ్ల్యూఎన్ ఆంధ్రప్రదేశ్ చైర్‌పర్సన్ డాక్టర్ జి.రమాదేవి మాట్లాడుతూ నేటి ఉరుకుల పరుగుల కాలంలో విద్యార్థుల వ్యక్తిగత శ్రేయస్సును సమతుల్యం చేసేందుకు ఏకాగ్రత, జ్ఞాపకశక్తిని ప్రభావితం చేసేందుకు స్వీయ క్రమశిక్షణ అవసరాలను, వాటిని మెరుగుపర్చుకునే విధానాలను, వారి అనుభవాలను వివరించారు. కార్యక్రమంలో సంస్థ వైస్ చైర్‌పర్సన్ చాందిని చందన, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డి.దీపక్ చౌదరి, కళాశాల మహిళా సాధికారత సెల్ కన్వీనర్ డి.మాధవి, కో కన్వీనర్ వి.రాధాదేవి, కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చురుగ్గా గ్రీన్‌బెల్ట్ పనులు

వ్యయం రూ.60 లక్షలు



సత్యం జంక్షన్ హైవేలో ఏర్పాటు చేస్తున్న గ్రిల్స్

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు గాంధీనగర్ వద్ద చేపట్టిన గ్రీన్‌బెల్టు పునరుద్ధరణ పనులు వేగంగా సాగుతున్నాయి. జనవరి 23వ తేదీన నియోజకవర్గ ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్‌లీడర్ పి.విష్ణుకుమార్‌రాజు పనులకు శంకుస్థాపన చేయడం తెలిసిందే. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అప్పట్లోనే ఎమ్మెల్యే అధికారులను కోరారు. ఈ నేపథ్యంలో జోన్–3 అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీనివాస్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి పనులు పర్యవేక్షిస్తున్నారు. జాతీయ రహదారిపై నిర్ణీత మీటర్ల మేర గ్రీన్‌బెల్టు ఫెన్సింగ్ ఏర్పాటు పనుల కోసం సుమారు రూ.60 వెచ్చించనున్నారు. సత్యం జంక్షన్ నుంచి గురుద్వార వైపు ఈ ఫెన్సింగ్ పనులు నిర్వహించాల్సి రుంది. గ్రీన్ బెల్టు ప్రాంతాల్లో జరుగుతున్న కబ్జాల నివారణకు ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ఏళ్ల తరబడి మరమ్మతులు లేకపోవడం, మరోవైపు ఆక్రమణల కారణంగా ఈ ప్రాంతాల్లో గల గ్రీన్‌బెల్టు దాదాపు ధ్వంసం అయిందని స్థానికులు ఆందోళన చెందడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నెల నుంచి పనులు చురుగ్గా సాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఇక్కడ ముందుగా గోతులు తవ్వి ఫెన్సింగ్, గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు



జోన్-3 కమిషనర్ శివప్రసాద్

సీతమ్మధార: జీవీఎంసీ జోన్-3 పరిధిలోని ఎంపిక చేసిన సచివాలయాల్లో ఈ నెల 21 నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తామని జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ తెలిపారు. జోనల్ కార్యాలయంలో గురువారం 'సాక్షి'తో ఆయన మాట్లాడారు. పుట్టిన నాటి నుంచి ఇంతవరకు ఆధార్ కార్డు నిమిత్తం నమోదు కాని పిల్లల కోసం ఈ శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని న్యూ వెంకోజీపాలెం–106 సచివాలయం, మద్దిలపాలెంలోని 117 సచివాలయంలో శిబిరాలు జరుగుతాయన్నారు. ఉత్తర నియోజకవర్గంలోని అక్కయ్యపాలెం దరి లలితానగర్‌లో గల 125 నంబర్ సచివాలయం, పాత రేసపువానిపాలెంలోని 138 నంబర్ సచివాలయంలోను శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. దక్షిణ నియోజకవర్గంలోని దొండపర్తిలో గల 143 నంబర్ సచివాలయంలో ఆధార్ ప్రత్యేక శిబిరాలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల పిల్లల తల్లిదండ్రులు తమ ఆధార్ కార్డులతో ఈ సచివాలయాల్లో ఈ నెల 21వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటలలోపు పిల్లలకు ఆధార్ నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు వాటర్ బాటిళ్ల పంపిణీ



విద్యార్థులకు వాటర్ బాటిళ్లు అందజేస్తున్న ఆకుల ఇందిర తదితరులు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం రామ్మూర్తి పంతులుపేట ఉన్నత పాఠశాలలో నాంది ఫౌండేషన్ పీవో సత్య ఆధ్వర్యంలో విద్యార్థులకు వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. అలాగే ఆర్పీపేట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్. శ్రీనివాసరావు చేతుల మీదుగా 94 మందికి స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. పాఠశాలలో బాలికల విద్యను ప్రోత్సహిస్తున్న నాంది ఫౌండేషన్ సభ్యులకు ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఎస్ఏ ఆకుల ఇందిర, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ సీహెచ్ పల్లవి, పాఠశాల పీఈటీ బాలరాజు, యోగా టీచర్ ఈతలపాక స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ నటుడు శోభన్‌బాబు



శోభనబాబు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న అభిమానులు



శోభన్‌బాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉమామహేశ్వరరావు తదితరులు

సీతంపేట: సినీ నటుడు, నటభూషణ్ శోభన్‌బాబు జీవితం అందరికీ ఆదర్శనీయమని ఏయూ మాజీ రిజిస్ట్రార్ వెలగపూడి ఉమామహేశ్వరరావు అన్నారు. శోభన్‌బాబు 17వ వర్ధంతి సందర్భంగా ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం అక్కయ్యపాలెం స్వరాలయ స్టూడియోలో శోభన్‌బాబు సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నటనలో క్రమశిక్షణ కలిగిన వ్యక్తి శోభన్‌బాబు అని కొనియాడారు. ముందుగా శోభన్‌బాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంగీత విభావరిలో విశ్వప్రసాద్ కోమలి పాడిన చిలకమ్మా పలికింది, డీసీపీ నాయుడు, సాహిణి పాడిన సంగమం సంగమం, మనోహర్, షాను పాడిన హత్తుకో మన్నాది భామ, బాలకృష్ణ నీలు పాడిన నీలాల నింగిలో వంటి గీతాలతో గాయనీ గాయకులు అలరించారు. కార్యక్రమంలో ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు చెన్నా తిరుమలరావు, విజయ్ నిర్మాణ్ గ్రూప్ అధినేత ఎస్.విజయ్‌కుమార్, వీ డెంటల్ ఆస్పత్రి అధినేత కె.ఎం.కె.రమేష్, సినీ నటుడు ఆర్.యాద్‌కుమార్ పాల్గొన్నారు.

సేవాతత్పరుడు శోభన్‌బాబు

కంచరపాలెం: స్థానిక రామ్మూర్తి పంతులు పేటలోని మహాత్మాగాంధీ గ్రంథాలయం వద్ద సిటీ వైడ్ శోభన్‌బాబు, కంచరపాలెం ఫ్యాన్స్ అధ్యక్షుడు కొణతాల వెంకటరావు ఆధ్వర్యంలో గురువారం నటభూషణ్ శోభన్‌బాబు 17వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా శోభన్‌బాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘసేవకు మారుపేరుగా శోభన్‌బాబు ఖ్యాతి గడించారని కొనియాడారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం భారీ అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో మువ్వల పోలారావు, కె.వెంకటరావు, కొణతాల చిన్న, విజయకుమార్, మురళీరాజ్, ఎం. సూర్యనారాయణ, జి.ఫణిభూషణరావు, పి.పైడిరాజు, డీవీ రావు, కె.సూర్యరత్నం, పి.దేవకి, పల్లా ఈశ్వరరావు, నైదాన శంకరావు పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు ఒడిశా వాసి



సుబుదిని తల్లికి అప్పగిస్తున్న శ్రద్ధా ఉద్యోగి



షెల్టర్ హోంలో ఆశ్రయం పొందిన సురేంద్రరెడ్డి

సీతమ్మధార: ఒడిశాలోని గంజాం జిల్లా బరంపూర్‌కు చెందిన సునం సుబుది హోటల్లో పని చేసేవాడు. అయితే తర్వాతి కాలంలో అతను మానసిక వ్యాధికి గురయి కుటుంబ సభ్యులను చితకబాదేవాడు. పలు మార్లు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతనికి తల్లి, సోదరుడు ఉన్నారు. ఆరు నెలల క్రితం ఊరు వదిలి వైజాగ్ వచ్చేసాడు. అతన్ని రైల్వేస్టేషన్‌లో ఏయూటీడీ సిబ్బంది గుర్తించి షెల్టర్ హోంకి తరలించారు. అతని వ్యాధికి చికిత్స అందజేయడంతో కోలుకున్నాడు. తన చిరునామా తెలిపాడు. దాంతో అతన్ని తల్లి దేబజకి అప్పగించినట్లు షెల్టర్ హోం నిర్వాహకులు తెలిపారు.

అభాగ్యుడికి ఆశ్రయం..

తెనాలి సమీపంలోని పరిమి గ్రామానికి చెందిన సురేంద్రరెడ్డి (70) అవివాహితుడు. ఇతని తల్లిదండ్రులు, అన్నదమ్ములు మరణించారు. అతని మూడెకరాల పొలం వదిన ఆధీనంలో ఉండడంతో అనాథగా మారాడు. భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర ఇతన్ని కొందరు చూసి టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని షెల్టర్ హోంకు తీసుకొచ్చారు. సంస్థ కార్యదర్శి అతన్ని చేర్చుకున్నారు. స్నానం తర్వాత దుస్తులు, భోజనం ఇచ్చి వసతి కల్పించారు.

ఆన్‌లైన్ బెట్టింగ్స్ జోలికి వెళ్లొద్దు

మద్దిలపాలెం: ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యతిరేక ఉద్యమంలో భాగంగా జన జాగరణ సమితి ప్రతినిధులు గురువారం మద్దిలపాలెం కృష్ణా కళాశాల రోడ్డులోని అలయన్స్ హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, యువత చేత ఆన్‌లైన్ బెట్టింగ్‌ల జోలికి వెళ్లొదని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు మాట్లాడుతూ కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే 1500 మందికి పైగా ఆన్‌లైన్ బెట్టింగ్ ఊబిలో పడి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను పూర్తిగా నిషేధిస్తూ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జన జాగరణ సమితి విశాఖ మహానగర కన్వీనర్ చింతపల్లి సునీల్‌కుమార్, నాయకులు దేవర శంకర్, హరికృష్ణ, కిరణ్ పాల్గొన్నారు.

బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పట్టించుకోండి



సమావేశంలో సంఘ ఏపీ అధ్యక్ష, కార్యదర్శులు జి.రామచంద్రరావు, పి.వి.రాంకుమార్

సీతమ్మధార: అఖిల భారత బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సమాఖ్య దేశ వ్యాప్తంగా ఉన్న 3 లక్షల మంది విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై నేరుగా ప్రభుత్వంతో చర్చించే అవకాశం లేదని సమాఖ్య ఏపీ అధ్యక్ష, కార్యదర్శులు జి.రామచంద్రరావు, పి.వి.రాంకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆశీలమెట్టలోని ఓ హోటల్లో గురువారం జరిగిన సంఘ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. సమస్యలపై యూఎఫ్‌బీయూతో చర్చించినా.. వారు బ్యాంకుల్లో పనిచేస్తున్న వారిపైనే శ్రద్ధ చూపుతున్నారు తప్ప, విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. 1986 నుంచి బ్యాంక్ ఉద్యోగులకు పెన్షన్ విధానం అమలు చేస్తున్నా.. బ్యాంక్ విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ సవరణ జరగడంలేదని ఆక్షేపించారు. బ్యాంక్ విశ్రాంత ఉద్యోగులు తమ పెన్షన్ నుంచే ఆరోగ్య బీమా చెల్లింపులు చేస్తున్నారని పేర్కొన్నారు. సమస్యలను సంఘటితంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో తెలంగాణ అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.